క్లుప్తంగా

గుండె వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తాడిపత్రి అర్బన్: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురానికి చెందిన మార్క్ హాస్పిటల్ వైద్యులు 130 మందికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి సుబ్రమణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



రిలే దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పెద్దవడుగూరు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత రామాంజనేయులు, మండల నాయకులు భూపతి, రంగస్వామి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈనెల 18 నుంచి 22 వరకూ నిర్వహించే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

గుత్తి రూరల్: గుత్తి మునిసిపాలిటీ, మండలానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం గుత్తిలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నిజామీ షాదీఖానాలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జిల్లా స్థాయి అధికారులు హాజరు అవుతారని పేర్కొన్నారు. ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ సూచించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



ప్రతిభ చూపిన విద్యార్థులతో పీడీలు

యల్లనూరు: చిలమకూరు మోడల్‌స్కూల్లో గురువారం మండలస్థాయి క్రీడా పోటీలను ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి ప్రారంభించారు. యల్లనూరు, వెన్నపూసపల్లి, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా, కూచివారిపల్లి, తిమ్మంపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాల బాలికలకు అండర్ -14, అండర్ -17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఈఓలు అభినందించారు. హెచ్‌ఎం మహేష్, పీడీ విజయకుమారి, బాలమధుసుదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, ప్రసాద్‌నాయక్, ఈశ్వరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాబయ్య

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి పార్టీ అధిష్టానం దృష్టిసారించింది. గురువారం కొత్తగా పలువురికి పార్టీలో చోటు కల్పిస్తూ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా దూదేకుల బాబయ్య (తాడిపత్రి), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి (అనంతపురం అర్బన్)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ట్రస్ట్ సేవలు విస్తృతం చేస్తాం



సిబ్బందితో కేక్ కట్ చేయిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: ఫయాజ్‌బాషా ట్రస్టు ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత, ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. ఫయాజ్‌బాషా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్ష కేంద్రం మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కేంద్రంలో సిబ్బందితో ఫయాజ్‌బాషా కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ కేంద్రం ద్వారా 7,300 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు యస్దాన్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, అస్లాం, షబ్బీర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య రక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం



గుంతకల్లు టౌన్ : మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున



యల్లనూరు: మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్

గుంతకల్లుటౌన్: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. గురువారం కౌన్సిల్ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటా సర్వే, హెల్త్‌క్యాంప్‌ల నిర్వహణ గురించి కమిషనర్ వివరించారు. ఈ నెల 15 నుంచి వార్డు వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో కలిసి వార్డు ఆరోగ్య కార్యదర్శులు క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు. నెలాఖరులో హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై కూడా ప్రజలకు తెలియజేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, స్వాతి, సంజీవ్, సోఫియా, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు దేవరాజన్, పరమేశ్వర్, శ్రీరాంకుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి క్షేత్రస్థాయిలో వలంటీర్లతో సర్వే చేయిస్తామన్నారు. మండలంలో సచివాలయాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారిని గుర్తించి జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తామన్నారు. ఎంఈఓ కాశెప్ప, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపల్ కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శ్రీ యాప్‌ను ప్రజల సెల్‌ఫోన్లలో డౌన్ లోడ్ చేయిస్తామన్నారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

యల్లనూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీఓ వీరరాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. సురక్ష పై వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలకు వైద్యులు లోకేష్, శివసాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ శ్వేత, ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీవీ శశికళ, డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డి, సీహెచ్‌ఓ జయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ్‌రెడ్డి మాట్లాడారు. వలంటీరు, అంగవాడీ, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి సురక్ష సర్వే చేసి ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



మహేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: బేతాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మహేష్‌రెడ్డిని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. మహేష్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆసుపత్రికి వెళ్లి మహేష్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుల శంకర్, మునిసిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజనేయులు, సుంకప్ప, నూర్‌నిజామీ, గుంతకల్లు మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, రవిరెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దపప్పూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం చాగల్లు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి(రామయ్య), సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ్‌రెడ్డి, చిక్కేపల్లి రామేశ్వరరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సూరి, స్థానిక నాయకులు వాసుదేవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు హాజీ వలి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు స్వామి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.

థ్యాంక్యూ సీఎం సార్



సంబరాలు జరుపుకుంటున్న ఈయూ నాయకులు

తాడిపత్రి అర్బన్: ఎంప్లాయీస్ యూనియన్‌ను అతిపెద్ద సంఘంగా గుర్తిస్తూ ప్రభుత్వం జీఓ 97 విడుదల చేయడంతో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ నాయకులు, సభ్యులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం వైఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి మిఠాయిలను పంపిణీ చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత రాష్ట్ర నాయకత్వం కృషితో తమ సంఘానికి గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వానికి సిబ్బందికి అనుసంధానంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జోనల్ నాయకుడు రహంతుల్లా, డిపో సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



ఎద్దులపల్లిలో పింఛన్ అందిస్తున్న నాయకులు



గుత్తి: 6వ వార్డులో కొత్త పింఛన్లు అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక తిలక్‌నగర్ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను వార్డు కౌన్సిలర్ కే.నీలవతి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తోందన్నారు. వార్డులో మొదటి, రెండో విడత కింద 12 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మార్కెట్ వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పామిడి: ఎద్దులపల్లిలో గురువారం రెండో విడత 27 మందికి మంజూరైన పింఛన్లను సర్పంచ్ జీ వెంకటరమణమ్మ అందజేశారు. సచివాలయాల రూరల్ కన్వీనర్ ఎస్‌ఆర్‌ఐ ఎం కుమార్‌రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, వీరా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు(గుత్తి ఆర్‌ఎస్)లో కౌన్సిలర్ రాజేశ్వరి, వార్డు ఇన్‌చార్జ్ సుధాకర్ రావు గురువారం ఆరుగురు కొత్త పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కౌన్సిలర్ రాజేశ్వరి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామన్నారు. సచివాలయ ఇన్‌చార్జ్ షెక్షావలి, సచివాలయ అడ్మిన్ వెంకటకృష్ణ, వెల్ఫేర్ సెక్రటరీ గంగాధర్, మహిళా పోలీసు దివ్యవాణి పాల్గొన్నారు.

నార్పల: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, నాయకులు బాలనాగిశీనా, భూషణ్‌రెడ్డి, చికెన్ గోపాల్, నాగరాజు, పెద్దన్న పాల్గొన్నారు.

రైతులకు పరిశోధన ఫలాలు అందించండి



శాస్త్రవేత్తలతో వివరాలు తెలుసుకుంటున్న పాలకవర్గ సభ్యులు

బుక్కరాయసముద్రం: రైతులకు పరిశోధన ఫలాలను అందించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పాలక వర్గం సభ్యులు డాక్టర్ మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి శాస్త్రవేత్తలకు సూచించారు. గురువారం వారు రేలకుంటకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యసాయ పరిశోధనా స్థానం, రెడ్డిపల్లిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమయ్యే పరిశోధనలను చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. సమగ్ర వ్యవసాయం, చిరు ధాన్యాల సాగు, కంది, ఆముదం, సజ్జ, అలసంద, వేరుశనగ పంటలను పరిశీలించారు. తక్కువ ఖర్చుతో పంటల సాగుపై రైతులకు సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, రెడ్డిపల్లి కేవీకే కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే ప్రతిష్టిద్దాం

గుంతకల్లుటౌన్: వినాయకచవితిని పురస్కరించుకుని పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మట్టివినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని డీవైఎఫ్‌ఐ ముద్రించిన వాల్‌పోస్టర్లను గురువారం కమిషనర్ విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు ప్రతాప్, ఉపాధ్యక్షులు శ్రీనాథ్, సురేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకటేష్, చందూ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నార్పల: నాయనపల్లి, నడిమిదొడ్డి, చామలూరు, బొందలవాడలో శుక్రవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పర్యటించనున్నట్లు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి గురువారం తెలిపారు. నాయనపల్లిలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, నడిమిదొడ్డిలోని విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, చామలూరులోని రైతు భరోసా కేంద్రం, బొందలవాడలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

పామిడి: స్థానిక కొత్తబస్టాండ్ ఆవరణలో ప్రబోధ సేవాసమితి-పామిడి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ముగిసాయి. ఈసందర్భంగా శ్రీకృష్ణుని ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు.

హీమోఫీలియా బాధితులు జాగ్రత్తలు పాటించాలి



ఆస్పత్రికి ఫ్రిడ్జ్‌ను అందజేస్తున్న సొసైటీ సభ్యులు

గుంతకల్లుటౌన్: హీమోఫీలియా అనేది ఓ అరుదైన జన్యుపరమైన వ్యాధి అని, బాధితులు సరైన వైద్యం పొందుతూ జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ప్రభుత్వాస్పత్రిలో హీమోఫీలియా బాధితుల కు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తుల విన్నపం మేరకు ప్రభుత్వం ఫ్యాక్టర్ ఇంజెక్షన్లను ఆస్పత్రికి పంపింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హీమోఫీలియా బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఫ్యాక్టర్ ఇంజెక్షన్లను భద్రపరచడానికి అవసరమైన ఫ్రిడ్జిని జిల్లా హీమోఫీలియా వ్యాధిగ్రస్తుల సొసైటీ తరపున ఆస్పత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథ్, ఆర్‌ఎంఓ సురేఖ, స్టోర్ ఇన్‌ఛార్జ్ సబిహా, సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు చిక్కన్న, కోశాధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల సస్పెన్షన్ సిఫార్సు రద్దు



ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జయరామిరెడ్డి, రమేష్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, ఓబుళాపురం సర్పంచ్ రమేష్‌రెడ్డి, నెలగొండ సర్పంచ్ భర్త జయరామిరెడ్డిపై సస్పెన్షన్ సిఫార్సును రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. ఇటీవల బీజేపీ అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, జయరామిరెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి వారిద్దరి సస్పెన్షన్‌కు సిఫారసు చేశారు. ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసి క్షమాపణ కోరుతూ జరిగిన తప్పుకు సంజాయిషీ ఇచ్చుకున్నారు. ఈక్రమంలో గురువారం వారు జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే వైవీఆర్‌తో కలిసి సంజాయిషీ ఇచ్చుకున్నారు. దీంతో సంతృప్తి చెందిన మంత్రి మొదటి పొరపాటుగా మన్నిస్తూ ఆ ఇద్దరి నాయకులపై ఉన్న సస్పెండ్ సిఫారసు లేఖను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా పార్టీ పట్ల విధేయులుగా ఉండాలని సూచించారు. నాయకులు రమేష్‌రెడ్డి, జయరామిరెడ్డి మంత్రి, ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్షర జ్ఞానం తప్పనిసరి

పెద్దవడుగూరు: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ అక్షర జ్ఞానం అవసరమని ఆర్డీటీ బుక్కరాయసముద్రం రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, గుత్తి ఏటీఎల్ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలికలను చదివించడం ద్వారా నవ సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.

వినాయక మంటపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే వినాయక మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ సీఎం గంగయ్య పేర్కొన్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వినాయక మంటపాలకు నిర్వాహకులు ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. ఇందుకోసం తాడిపత్రి సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. నిర్వాహకులకు ఏ సమస్య తలెత్తినా పోలీసు అధికారి, లేదా డయల్ 100కు గాని ఫోన్ చేయాలన్నారు. మండపాల వద్ద పగలు 55, రాత్రి 45 డెసిబుల్స్‌కు మించకుండా స్పీకర్లను వినియోగించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను, నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

బుక్కరాయసముద్రం: మండలంలో వినాయక చవితి నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాలలో వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఈమేరకు రూరల్ ఎస్‌ఐ సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా హిందీ బాషా దినోత్సవం

గుత్తి: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో గురువారం హిందీ బాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసన్ హిందీ గొప్పతనాన్ని వివరించారు.

గార్లదిన్నె: స్థానిక దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ, సంస్థ(ట్రాక్టర్ నగర్) లో గురువారం ఘనంగా హిందీ బాషా దినోత్సవం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారీ నాందెడే హిందీ ప్రాముఖ్యతను వివరించారు. ఈనెల 29 వరకు ట్రాక్టర్ నగర్‌లో హిందీ బాషా దినోత్సవం నిర్వహిస్తామని, రోజూ హిందీ భాషణ్, వ్యాసరచన, హిందీ టైపింగ్ వంటి పోటీలు ఉంటాయని తెలిపారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి

గుంతకల్లు రూరల్: మొలకలపెంట గ్రామంలో గురువారం స్థలం వివాదంలో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఎస్‌ఐ గోపాలుడు తెలిపిన వివరాలు.. ఈరన్న అనే వ్యక్తికి ఇద్దరు భార్యలున్నారు. అదే గ్రామానికి చెందిన శేషయ్య అనే వ్యక్తి ఇటీవల మొదటి భార్య నుంచి 5 సెంట్ల స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కాగా ఆ స్థలం రెండో భార్య పేరున ఉందంటూ కొద్ది కాలంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈక్రమంలో ఈరన్న రెండో భార్య తరపు వ్యక్తులు గోవిందు, ఆదినారాయణ, నారాయణస్వామి మరికొంతమంది వ్యక్తులు గురువారం శేషయ్య ఇంటి వద్ద గొడవకు దిగారు. ఆ సమయంలో శేషయ్య ఇంట్లో లేకపోవడంతో అతడి తమ్ముడైన ప్రసాద్‌పై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రీ సర్వేకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష కింద స్థలాల రీసర్వే కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి పట్టణ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులు తమ స్థలాలకు సంబంధించిన హద్దులను నిర్ణయించి హక్కు పత్రాలు జారీ చేసేందుకు వార్డు సచివాలయ సిబ్బంది లేదా వలంటీర్లను సంప్రదించాలన్నారు.

'పీఎం విశ్వకర్మ యోజన' సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లుటౌన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ కౌసల్య యోజన విభాగపు జిల్లా కన్వీనర్ లోకేష్ ఆచారి సూచించారు. గురువారం శాంతినగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో పీఎం విశ్వకర్మ యోజన ప్రయోజనాలను వివరించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పుట్లూరు: కుమ్మనమల గ్రామానికి చెందిన మనీషా(18) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. కడుపునొప్పి తాళలేక ఆగస్టు 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఈమెను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో గురువారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.